

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి యశస్వి పథకం కింద ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎస్.కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న బీసీ, ఈబీసీ, సంచార జాతులకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, పాఠశాల/కళాశాల ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్:// వీఈటీ. ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

జీడిపైనా నిర్లక్ష్యం



- గత వైసీపీ సర్కారు అలసత్వం
- జిల్లాలో మూతపడిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు
- వాటి నిర్వహణను గాలికొదిలేసిన వైనం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు
- ప్రస్తుతం నిరుపయోగంగా భవనాలు.. తుప్పుపట్టిపోతున్న యంత్రాలు
- గిరిజన రైతులకు తప్పని ఇబ్బందులు
- నూతన ప్రభుత్వంపై ఆశలు

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో జీడి తోటలున్నాయి. ఎంతోమంది గిరిజన రైతులు వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే 'మన్యం'లో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు మూతపడడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వంలో అవి బాగానే పనిచేసేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా గుమ్మలక్ష్మీపురం, సాలూరు మండలాల్లో ఉన్న నాలుగు యూనిట్లు మూత పడ్డాయి. దీంతో గిరిజన రైతులంతా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

- పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో సుమారు 85 వేల ఎకరాల్లో జీడి తోటలున్నాయి. సీతంపేట పరిధిలో వీడీవీకేల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ జరుగుతున్నందున అక్కడ ఎటువంటి ఇబ్బందులు లేవు. పార్వతీపురం పరిధిలో మాత్రం ఆ పరిస్థితి లేదు.
- గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో సుమారు 65 వేల ఎకరాల్లో జీడితోటలు ఉన్నాయి. దాదాపు 20వేల మంది రైతులు ఈ సాగు చేపడుతున్నారు. వాస్తవంగా ఈ ప్రాంత జీడిపప్పునకు ఎంతో డిమాండ్ ఉంది. అందుకే ఇక్కడ పండే జీడిపిక్కలను చత్తీస్‌ఘడ్, ఒడిశా, రాజమండ్రి, పలాస తదితర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు.
- గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం గుమ్మలక్ష్మీపురం మండలం జేకే పాడు, ఇరిడి గ్రామాల్లో, సాలూరు మండలంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు భవన నిర్మాణాలు చేపట్టింది. ఏటా వాటి నిర్వహణకు నిధులు కేటాయించేది. దీంతో గిరిజన రైతులకు ఏ ఇబ్బందీ ఉండేది కాదు. అంతే కాకుండా ఈ నాలుగు యూనిట్లలో సుమారు 60 మంది గిరిజనులు ఉపాధి పొందేవారు. వారికి శిక్షణ పేరిట రోజుకు రూ.300 ఇచ్చేవారు. ఈ యూనిట్లు ద్వారా కొన్నాళ్ల పాటు జీడిపిక్కలను ప్రాసెసింగ్ చేసి సొసైటీల ద్వారా జీడిపప్పు విక్రయాలు చేపట్టేవారు.
- వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీన్ మారింది. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వాటి నిర్వహణకు నిధులు కూడా మంజూరు చేయలేదు. మరోవైపు ఐటీడీఏ , వెలుగు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో జిల్లాలో నాలుగు యూనిట్లు మూతపడ్డాయి. యంత్రాలన్నీ తుప్పు పట్టిపోతున్నాయి. విద్యుత్ కనెక్షన్లు తీసేశారు. ప్రస్తుతం ఈ భవనాలు నిరుపయోగంగా మారాయి. మరోవైపు గిరిజనులు ఉపాధి కోల్పోగా.. రైతులు పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. జీడి పిక్కలను జీసీసీ కూడా కొనుగోలు చేయకపోవడంతో గిరిజన రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.120 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

జేకేపాడులో మూతపడిన జీడి ప్రాసెసింగ్ యూనిట్

- ఏటా ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల కారణంగా ఏజెన్సీలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం నష్టపరిహారం కూడా మంజూరు చేయడం లేదు. తెగుళ్ల నివారణకు సలహా, సూచనలు కూడా ఇవ్వడం లేదు. పంట సంరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గిరిజన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.
- ఈ ప్రాసెసింగ్ యూనిట్లు పునఃప్రారంభిస్తే గిరిజన రైతులకు గిట్టుబాటు ధర దొరుకుతుంది. యువతకు ఉపాధి లభిస్తుంది. అదేవిధంగా ఇక్కడి జీడిపప్పును తిరుపతి, సింహాచలం, విజయవాడ వంటి ప్రముఖ దేవాలయాలకు సరఫరా చేసే అవకాశం కూడా ఉందని పరిశీలకులు చెబుతున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజనులు కోరుతున్నారు.

పునఃప్రారంభించాలి..

జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లను పునఃప్రారంభించాలి. గుమ్మలక్ష్మీపురం కేంద్రంగా భారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి. అప్పుడే ఏజెన్సీలో వలసలు తగ్గుతాయి. యువతకు ఉపాధి, రైతులకు మద్దతు ధర లభిస్తుంది.

- విప్లవ కుమార్, గిరిజన రైతు, లక్కగూడ

ఉన్నతాధికారుల దృష్టికి..

జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ల పునరుద్ధరణ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటాం.

- మురళీ, ఏపీవో, ఐటీడీఏ, పార్వతీపురం

వారానికి 3 రోజులే..

- చినమేరంగి సీహెచ్‌సీలో గైనిక్ సేవల పరిస్థితి ఇదీ..
- ఆసుపత్రికి వచ్చిన వారిని రిఫర్ చేస్తున్న వైనం
- గర్భిణులు, బాలింతలకు తప్పని తిప్పలు
- మండిపడుతున్న మండలవాసులు

జియ్యమ్మవలస, అక్టోబరు 7 : జియ్యమ్మవలస మండలం చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ఇక్కడి సీహెచ్‌సీకి వచ్చిన వారిని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం లేదా పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. దీంతో మండల వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవానికి చినమేరంగి సీహెచ్‌సీ గైనికాలజిస్టుగా అన్నాజీరావు ఉండేవారు. ఆయన ఇక్కడ 2022 నుంచి ఈ ఏడాది జూలై 14 వరకు పనిచేశారు. రోజుకు 50 మంది గర్భిణులు సీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందేవారు. అయితే కొన్ని నెలల కిందట ఆయన డిప్యుటేషన్ రద్దు చేసి మళ్లీ సాలూరు ఏరియా ఆసుపత్రికి పంపించారు. కాగా ఆ స్థానంలో పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి నుంచి డిప్యుటేషన్‌పై సునీల్‌కుమార్‌ను ఇక్కడ నియమించారు. అయితే ఆయన వారానికి మూడు రోజులే వైద్య సేవలు అందించడంతో గర్భిణులు, బాలింతలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇదే సమయంలో కొందర్ని రిఫర్ చేస్తున్నారు. ఆసుపత్రిలో గైనిక్ సేవలు సక్రమంగా అందకపోవడంతో గర్భిణుల ఓపీ పడిపోయింది. ఇక్కడ డెలివరీల సంఖ్య తగ్గిపోయింది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని 105 గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యేకి తెలియజేశాం..

ఆసుపత్రిలో వారానికి మూడు రోజులు మాత్రమే గైనిక్ సేవలు అందుతున్నాయి. దీనివల్ల ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పడిపోయింది. గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ సమస్యను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టిలో పెట్టాం.

- టీకే సునీల్‌కుమార్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, చినమేరంగి





చినమేరంగి సీహెచ్‌సీ

కూలితే.. అంతే!



కొమరాడ, అక్టోబరు 7 : జిల్లా కేంద్రానికి కూతవేటు దూరం.. కోటిపాం సమీపంలోని జంఝావతి నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 1933లో సుమారు 7 టన్నుల సామర్థ్యంతో దానిని నిర్మించారు. అయితే ప్రస్తుతం ఈ వంతెనపై 50 నుంచి 70 టన్నుల సామర్థ్యం గల వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. జిల్లాతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన భారీ వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ వంతెన కూలితే.. ప్రత్యామ్నాయ మార్గం కూడా లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మద్యం షాపులకు 304 దరఖాస్తులు

- అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన కిషోర్



పార్వతీపురం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 52 మద్యం షాపులకు రోజురోజుకూ దరఖాస్తులు పెరుగుతున్నాయి. లాటరీ విధానంలో ఎవరికి ఏ షాపు దక్కుతుందో ఈనెల 11న తేలనుంది. కాగా ఇప్పటివరకు 304 దరఖాస్తులు వచ్చినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన కిషోర్ సోమవారం తెలిపారు. ఈ నెల 9లోగా పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు అందజేయొచ్చని వెల్లడించారు. ఆన్‌లైన్ విధానం కూడా అందుబాటులో ఉందన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి షాపులను కేటాయించనున్నట్లు తెలిపారు.

పేదల బియ్యం పక్కదారి..

- విస్తృతంగా అధికారుల తనిఖీలు
- రెండు మండలాల్లో 31.7 టన్నుల స్వాధీనం

గరుగుబిల్లి, అక్టోబరు 7 : పేదల బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రీసైక్లింగ్ చేసి అధిక ధరలకు వాటిని తిరిగి అమ్మడం పరిపాటిగా మారింది. మరికొందరు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో నిల్వ చేసి ఒడిశా ప్రాంతానికి తరలిస్తూ.. రెండు చేతులా సంపాదిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో అధికారులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో గరుగుబిల్లి మండలం గొల్లవానివలసలో సోమవారం రేషన్ బియ్యం నిల్వలపై దాడులు నిర్వహించారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గొడౌన్‌లో నిల్వ చేసిన 480 బస్తాల్లో 24 వేల కిలోల (24 టన్నుల) రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు గొడౌన్ నుంచి వేరే ప్రాంతానికి బియ్యం తరలించే సమయంలో స్పెషల్ బ్రాంచి పోలీసులు, గరుగుబిల్లి పోలీస్ సిబ్బంది సంయుక్తంగా అక్కడకు చేరుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. గత నెల 15న ఉల్లిభద్ర సమీపంలోని కోళ్ల ఫారంలో నిల్వ చేసిన 6,500 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల తిరగక ముందే మండలంలో భారీ స్థాయిలో బియ్యం నిల్వలను సీజ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. గొడౌన్‌లో రైస్ నిల్వ చేసి తరలింపునకు సిద్ధమైన మహ్మద్ ఇర్ఫాన్, డ్రైవర్ గోపాలశెట్టి అప్పలరాజు, సహాయకులు చిన్న, గంగులుపై కేసు నమోదు చేసినట్లు గరుగుబిల్లి హెచ్‌సీ ఎన్.ఈశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం సమాచారాన్ని తహసీల్దార్ వి.బాలకు అందించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది రాములు, సుధ, వీఆర్‌వో వి.కరుణాకర్ తదితరులు ఉన్నారు.



సీతానగరం హనుమాన్ కూడలిలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

నిర్మానుష్య ప్రాంతాల్లోనే..

నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలకు ఆటోలు, నాటు బండ్లపై రేషన్ బియాన్ని తరలించి భద్రపరుస్తున్నారు. గతంలో తోటపల్లి సమీపంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో, కోళ్ల ఫారాల్లో, నిరుపయోగ గొడౌన్లలో నిల్వ చేసి.. అనువైన సమయాల్లో వాటిని వేరే ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే రేషన్ బియ్యానికి కాళ్లు వస్తున్నాయి. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దీనికి అడ్డుకట్ట వేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.



గొల్లవానివలసలోని ఓ గొడౌన్‌లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరంలో 7.7 టన్నులు

సీతానగరం : సీతానగరంలోనూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం 7.7 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు వారు బొబ్బిలి-పార్వతీపురం వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాశీపేట, సీతానగరం, చినభోగిలి ప్రాంతాల్లో మూడు వాహనాల్లో 154 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బొబ్బిలి మండలం పిరిడి, కమ్మవలస గ్రామాలకు చెందిన రేపాక శ్రీనివారావు, భోగిరాల శ్రీనివాస రావు, కేతల ధనుంజయరావు అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. మొత్తంగా 7,700 కిలోల బియ్యం విలువ రూ.3,50,350 ఉంటుందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బి.ప్రసాదరావు, బి.సింహాచలం తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో అధిక ధరలకు విక్రయించేందుకు రేషన్ బియ్యం తరలిస్తున్నగా వారు తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులు, వాహన డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, శేషగిరి, సీఎస్‌డీటీ ఎన్.రమేష్ బాబు, వీఆర్‌వోలు ఎస్.లక్ష్మి, జి.నాగమణి, కుమార్, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

నివేదికలు అందించండి

- పోస్టుమెట్రిక్ వసతిగృహాలపై కలెక్టర్ ఆదేశం

పార్వతీపురం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు అవసరమైన పక్కా భవనాలు, మౌలిక వసతులకు సంబంధించి నివేదికలు అందించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ.. వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలని, భవనాలు అద్దెకు తీసుకొని పిల్లల చదువుకునే వాతావరణం కల్పించాలని సూచించారు. పాత భవనాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతిశాఖలో ఉన్న పోస్టుమెట్రిక్ వసతిగృహాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు ఏ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి.. సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.

క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలి

జాతీయ స్థాయిలో పోటీపడేలా జిల్లాలోని క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో క్రీడా సాధికారిత సంస్థ జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వరరావుతో మాట్లాడుతూ... ఈ దఫా రాష్ట్రస్థాయిలో జరగబోయే ఆర్చరీ క్రీడా పోటీలకు జిల్లా తరపున క్రీడాకారులను పంపాలని సూచించారు. 'మన్యం'లో స్టేడియం నిర్మాణానికి స్థలం గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధ్వజస్తంభం, ఇత్తడి తొడుగులూ అమ్ముకొన్నారు

» వైసీపీ నేతల అరాచకంపై టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో వైసీపీ నేతలు గుడి ధ్వజస్తంభం, ఇత్తడి తొడుగులు అమ్ముకొన్నారని సూలం రమేశ్ అనే వ్యక్తి సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 'నర్సరావుపేట స్టేషన్ రోడ్డులో ప్రసన్నాంజనేయ స్వామి గుడిలో ఏర్పాటు చేయడానికి ధ్వజస్తంభం, దానికి ఇత్తడి తొడుగులు, ఇత్తడి సామాను తెచ్చాం. వైసీపీ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు బొగ్గరం మూర్తి, నరసింహకుమార్ వాటిని అమ్ముకొన్నారు. ఈ గుడి పునర్నిర్మాణానికి నేను నిధులు ఖర్చు చేశాను. శిలా ఫలకంపై నా పేరు వేయిస్తే దానిని పగలగొట్టారు. నన్ను గుడిలోకి వెళ్లకుండా అడ్డుకుని, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు. గుడి సొత్తును కొట్టేసిన వారిపై చర్య తీసుకోవాలి. నాపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయించాలి' అని రమేశ్ విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ ఎన్నికల సమయంలో తనను కొట్టి నామినేషన్ వేయకుండా అడ్డుకొన్న వైసీపీ నేతలపై చర్య తీసుకోవాలని రాయచోటికి చెందిన కే అబ్దుల్ రెహమాన్ కోరారు. బిల్డర్ శ్రీహరి... 'రాష్ట్రవ్యాప్తంగా టీడీఆర్ బాండ్లను నిలిపివేయడం వల్ల భవన నిర్మాణంలో వాటిని వాడుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. దీనివల్ల నిర్మాణ పనులు కుంటుపడుతున్నాయి. సమస్యను పరిష్కరించండి' అని విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో 347 మంది దినసరి వేతనంపై పనిచేస్తున్నారు. వారిని అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలని గత ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆ ఉతర్వులు అమలు కాకపోవడంతో తమకు ఐదు నెలల నుంచి జీతాలు అందడం లేదు' అని కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. రాయచోటిలో ఇందిరమ్మ ఇళ్ల మధ్య స్కూల్, ఆట స్థలం కోసం వదిలిన స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించారని, దానిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని అబ్దుల్ రహీమ్ కోరారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో మాజీ వలంటీర్ షేక్ యాసిన్ అక్రమాలపై స్థానికులు ఫిర్యాదు చేశారు.

వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా సురేష్‌కుమార్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా గేదెల సురేష్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సురేష్ కుమార్ ఇండియన్ ఇన్‌ఫర్మేషన్(ఐఐఎస్) 2011 బ్యాచ్ అధికారి. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఇప్పటి వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన ఏపీ సీడ్స్ ఎండీ శివప్రసాద్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది.

ఇమామ్‌లు, మౌజన్‌లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలి

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని మసీదుల ఇమామ్, మౌజన్‌లందరికీ గౌరవ వేతనం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు జాతీయ మైనార్టీస్ కమిషన్ రాష్ట్ర మాజీ సలహారు అర్షద్ అయూబ్ ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేల మసీదుల ఇమామ్‌లకు రూ.పదివేలు, మౌజన్లకు రూ.ఐదు వేల గౌరవ వేతనం అందిస్తోందని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న 1423 గౌరవ వేతన దరఖాస్తులను కూడా సత్వరమే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

ఉత్తరాంధ్ర-ఒడిశా కొత్త రైల్వే లైన్ నిర్మించండి

» అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, ఒడిశా రాష్ట్రాన్ని కలుపుతూ నూతన రైల్వే లైన్‌ను నిర్మించాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు సమక్షంలో రైల్వే మంత్రికి ఎంపీ కలిశెట్టి వినతిపత్రం అందజేశారు. చీపురుపల్లి- రాజాం- పాలకొండ-సీతంపేట-కొత్తూరు-పర్లాకిమిడి-మెలియాపుట్టి-పలాసను కలుపుతూ రైల్వే లైన్‌ను నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎంపీ కలిశెట్టిని కేంద్ర మంత్రి వైష్ణవ్‌కు పరిచయం చేస్తూ 'వెరీ యాక్టివ్ ఎంపీ' అని ప్రశంసించారు. కాగా ఈ నెల 13న ప్రారంభమయ్యే పైడితల్లి సిరిమాను మహోత్సవాలకు రావాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఎంపీ కలిశెట్టి ఆహ్వానించారు.

చైనా గూఢచారి బెలూన్లను కూల్చే సత్తా భారత్‌కు!

న్యూఢిల్లీ, అక్టోబరు 7: ఇతర దేశాలపై నిఘాకి చైనా వినియోగిస్తున్న గూఢచారి బెలూన్లను కూల్చడంపై భారత వాయుసేన శిక్షణ పొందినట్లు సమాచారం. తాజాగా తూర్పు ఎయిర్ కమాండ్‌లో 55వేలకుపైగా ఎత్తులో ఎగురుతున్న చైనా తరహా గూఢచారి బెలూన్‌ను రఫెల్ జెట్‌ను ఉపయోగించి కూల్చివేశారు.

కౌలుదార్లకు మేలు చేసేలా కొత్త చట్టం

» కౌలు రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటాం

» గుంటూరు ప్రాంతీయ సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు



టమోటా, ఉల్లి ధరల అదుపుపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కౌలు రైతులకు మంచి చేసేలా సరికొత్త చట్టం తీసుకురాబోతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నూతన చట్టంలో భూయజమానికి ఎలాంటి అనుమానాలకు తావులేకుండా కౌలుదారుకు లబ్ధి జరిగేలా చూస్తామన్నారు. కౌలు రైతులు కార్డులు తీసుకొని వెళ్లగానే ప్రాథమిక పరపతి సంఘాల్లో సభ్యత్వం, సొసైటీల ద్వారా రుణాలు వంటివి వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం ఏపీలో 2024 కౌలురైతు చట్టాన్ని శాసనం చేసేందుకు తొలి ప్రాంతీయ సదస్సు జరిగింది. గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి కౌలురైతులు, రైతు సంఘాల నాయకులు హాజరయ్యారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ కొత్త చట్టంలోని అంశాలను రైతులకు వివరించారు. అనంతరం కౌలు రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రైతుకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 85-90 శాతం వ్యవసాయం కౌలుదారుల ద్వారానే జరుగుతున్నదని తెలిపారు. ప్రకృతి విపత్తులతో జరుగుతున్న నష్టం వర్ణనాతీతమని, అలాంటి వారికి సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కొత్త చట్టం ప్రతిపాదనలను ఇప్పటికే కేబినెట్ ముందుకు తీసుకొచ్చామని తెలిపారు. అందరినీ భాగస్వామ్యం చేసి, అందరి సలహాలతో చట్టాన్ని పకడ్బందీగా రూపొందిస్తామని మంత్రి పేర్కొన్నారు. కౌలురైతుల చట్టం మొదటగా 1956లో వచ్చిందని, ఆ తర్వాత 2011లో వచ్చిందని తెలిపారు. అయితే అది పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వం కొంత మేర అమలు చేయడంతో కౌలుదారులు సంతోషించారని అన్నారు. 2019లో వేరొక చట్టం చేసిన వైసీపీ ప్రభుత్వం.. మళ్లీ సమస్యను మొదటికి తీసుకొచ్చిందని విమర్శించారు. రైతు సంతకం పెడితే తప్ప కౌలురైతుకు సాయం అందని పరిస్థితి సృష్టించారని, జగన్ సర్కార్ కౌలు రైతులకు అన్యాయం చేసిందన్నారు. తాను వ్యవసాయ మంత్రి అయ్యాక కౌలు రైతులకు న్యాయం జరగాలని, వారు జీవితాంతం గుర్తుపెట్టుకొనే చట్టం రూపొందించాలని స్పెషల్ సీఎస్‌కు చెప్పిన వెంటనే ఆయన కసరత్తు చేసి చట్టం రూపొందించారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలనేదే ఈ చట్టం లక్ష్యమన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు బజార్లలో కిలో టమాటా రూ.50

» నేటి నుంచే: మంత్రి అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి రైతు బజార్లలో టమాటా కిలో రూ.50 చొప్పున విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో సోమవారం సచివాలయంలో టమాటా, ఉల్లి ధరలపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ధరల నియంత్రణలో భాగంగా రైతుల నుంచి నేరుగా ఉల్లి, టమాటా సేకరించి, రైతుబజార్లలో సాధారణ ధరలకు విక్రయించాలన్నారు. కూరగాయల ధరల పట్టికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.


మార్కెటింగ్ శాఖే కారణమా?!

రిటైల్ మార్కెట్‌లో టమాటా ధర పెరుగుదలకు పరోక్షంగా మార్కెటింగ్‌శాఖే కారణమన్న విమర్శలొచ్చాయి. అనంతపురం పులివెందుల మార్కెట్లలో అధికారులు టమాటా కిలో రూ.65-75 చొప్పున కొనుగోలు చేసి, ఇతర జిల్లాలకు పంపడంతో రిటైల్ మార్కెట్‌లో ధర పెరిగాయన్న వాదన వస్తోంది. అటు రైతుకు గిట్టుబాటు ధర ఇప్పించడానికి మార్కెట్‌లో జోక్యం చేసుకోవాల్సిన మార్కెటింగ్‌శాఖ ఇటు వినియోగదారులనూ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. కిలో రూ.50కి మించకుండా అందించాల్సి ఉంది.

మాల్దీవుల పర్యటనకు రండి!

» భారతీయులకు ముయిజ్జు విజ్ఞప్తి

» మోదీతో ద్వైపాక్షిక చర్చలు



న్యూఢిల్లీ, అక్టోబరు 7: తమ దేశంలో పర్యటనకు రావాలని మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలు, భారత్‌తో విభేదాలతో తమ పర్యాటక ఆదాయం పడిపోయిన నేపథ్యంలో ఆయన ఈ పిలుపునిచ్చారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు వచ్చేసిన ముయిజ్జు, సాజిదా దంపతులు సోమవారం రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అంతకుముందు వారికి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఘనస్వాగతం పలికారు. తర్వాత ప్రధాని మోదీతో ముయిజ్జు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాలూ పలు ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం మోదీతో సంయుక్త విలేకరుల సమావేశంలో ముయిజ్జు మాట్లాడుతూ ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న విదేశీ మారక సమస్యలను అధిగమించేందుకు భారత్ అందిస్తున్న సహాయసహకారాలు చాలా కీలకంగా మారనున్నాయంటూ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆపన్న హస్తం అందించడంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందని మోదీ స్పష్టం చేశారు. విదేశాంగ విధానంలో పొరుగువారికే తొలి ప్రాధాన్యం ఇస్తామని నొక్కి చెప్పారు. మాల్దీవులను 'సన్నిహిత మిత్రుడి'గా అభివర్ణించారు. ఆ దేశానికి అత్యవసర పరిస్థితుల్లోనూ, కొవిడ్ వ్యాక్సిన్ సరఫరా విషయంలోనే ముందుగా స్పందించినది భారతదేశమేనని గుర్తుచేశారు. భారత సాయంతో మాల్దీవుల్లో చేపట్టిన హనిమదూ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నూతన రన్‌వేను ఇరువురు నేతలు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతోపాటు మాల్దీవుల్లో రూపే‌కార్డు ద్వారా చెల్లింపులు జరిపే ప్రక్రియనూ ప్రారంభించారు. తద్వారా భారత పర్యాటకులు మాల్దీవులలో నగదు రహిత చెల్లింపులు చేయడం సులభం కానుంది. విదేశీ మారక నిల్వల సమస్యను మాల్దీవులు అధిగమించేలా రూ.3,359 కోట్లు(400 మి.డాలర్లు), మరో రూ.3 వేల కోట్ల కరెన్సీ స్వాప్ ఒప్పందాన్ని ప్రకటించారు.

చాన్నాళ్లకు ఆరోగ్యశాఖలో పదోన్నతులు

» ఇద్దరికి డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రమోషన్

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో చాలా కాలం తర్వాత ఇద్దరికి డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం.లక్ష్మీబాయ్, సీహెచ్.శ్రీనివాసకుమార్‌లకు ప్రమోషన్లు కల్పిస్తూ ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు. లక్ష్మీబాయ్‌ని మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డీడీగా, శ్రీనివాస కుమార్‌ను శ్రీకాకుళం బోధనాసుపత్రి డీడీగా నియమించారు. డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు జాయింట్ డైరెక్టర్ల పదోన్నతులు కల్పించాలని ఉద్యోగుల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. దాదాపు 10-12 ఏళ్ల నుంచి ప్రస్తుతం ఉన్న డిప్యూటీ డైరెక్టర్లకు పదోన్నతులు లేవు. జాయింట్ డైరెక్టర్ పోస్టులు రెండు మాత్రమే ఉన్నాయి. అయితే 10-12 ఏళ్లుగా డీడీలుగా పనిచేస్తున్న అధికారులు చాలా మంది ఉన్నారు. గత ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో 11 జాయింట్ డైరెక్టర్ కేడర్ పోస్టులను సృష్టించింది. ఈ పోస్టులు మొత్తాన్ని రెవెన్యూ సిబ్బందితో నింపాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆరోగ్య శాఖలో పోస్టులు సృష్టించి, రెవెన్యూ అధికారులతో ఆ పోస్టులను ఎందుకు నింపుతున్నారనేది ఎవరికీ అర్థం కావడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏళ్లుగా పదోన్నతులు లేని ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్లకు జేడీలుగా పదోన్నతులు కల్పించి, ఆ 11 పోస్టుల్లో వీరిని నియమించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పోలవరం సందర్శన బకాయిలు విడుదల

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా నడిచాయి. నదీ ప్రవాహ దిశను మారుస్తూ నిర్మిస్తున్న స్పిల్‌వే, స్పిల్ చానల్ సహా ప్రాజెక్టు పనులను రైతులు, విద్యార్థులు, ప్రజలు సందర్శించాలని అప్పట్లో చంద్రబాబు పిలుపిచ్చారు. ఆసక్తి ఉన్నవారిని అన్ని జిల్లాల నుంచి ఆర్టీసీ గరుడ బస్సుల్లో తరలించారు. ప్రాజెక్టు వద్ద వారందరికీ భోజనాలు పెట్టారు. ఇందుకోసం రూ.83.447 కోట్లు వ్యయమైనట్లు పోలవరం ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వీటిలో 2018-19 కాలంలో ఖర్చుచేసిన రూ.23.11 కోట్లు కూడా ఉన్నాయి. వీటిని చెల్లించేలోగా 2019 సార్వత్రిక ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఈ 23.11 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేకపోయింది. అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం.. ఆర్టీసీకి రూ.9.17 కోట్లను, భోజనాలు పెట్టిన హైదరాబాద్‌కు చెందిన స్పిల్‌వే ఎంటర్‌ప్రైజెస్, లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్‌లకు ఇవ్వాల్సిన రూ.14 కోట్లను చెల్లించలేదు. దరిమిలా లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, స్పిల్‌వే ఎంటర్‌ప్రైజెస్‌లు హైకోర్టును ఆశ్రయించాయి. వాదనలు విన్నాక 12 శాతం వడ్డీతో ఆ బిల్లులను చెల్లించాలంటూ ఈ ఏడాది జనవరి 9వ తేదీన హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను జగన్ సర్కారు బేఖాతర్ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా రూ.23.11 కోట్లను విడుదల చేస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఏఎస్ అధికారి శేషగిరిబాబుకు ఉపశమనం

» సింగిల్ జడ్జి తీర్పుపై ధర్మాసనం స్టే

అమరావతి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి శేషగిరిబాబుకు ఉపశమనం లభించింది. కోర్టు ధిక్కార కేసులో ఆయనకు నెల రోజులు సాధారణ జైలు శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఇటీవల ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం స్టే విధించింది. ఉత్తర్వులను 6 వారాల పాటు నిలుపుదల చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న విజయలక్ష్మికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. శేషగిరిబాబు తరఫున న్యాయవాది రఘువీర్ వాదనలు వినిపించారు.

బోయింగ్ 737 రడ్డర్లలో సమస్య

న్యూఢిల్లీ, అక్టోబరు 7: భారత్‌లోని కొన్ని వైమానిక సంస్థలు వినియోగిస్తున్న బోయింగ్ 737 మోడల్ విమానాల రడ్డర్లలో సమస్య ఉందని డీజీసీఏ హెచ్చరించింది. రడ్డర్ అంటే.. విమానం వెనుక భాగంలో ఉండే ఓ నియంత్రణ వ్యవస్థ. టేకాఫ్ అయ్యేటప్పుడు దీనిని కిందకు దించుతారు. ల్యాండ్ అయ్యే సమయంలో పైకి లేపుతారు. విమానం స్థిరంగా ఉంచేందుకు ఈ వ్యవస్థ పనిచేస్తుంది. కాగా, బోయింగ్ 737 అన్ని మోడల్స్‌లోనూ రడ్డర్ జామింగ్ ఉందని డీజీసీఏ పేర్కొంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్ జెట్, ఆకాశ్ ఎయిర్‌లు బోయింగ్ 737 సిరీస్ విమానాలను వాడుతున్నాయి. అంతే కాక.. ప్రధాని వినిగియోగించేది కూడా ఇదే సిరీస్‌లోనిదే.

నవ్య | చిత్రజ్యోతి



ట్రెండ్‌కు తగ్గట్లుగా...

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా'. నీలిమ గుణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విఘ్నేశ్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ను దిల్‌రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ అదిరిపోయింది. నైట్ లైఫ్, డ్రగ్స్ కల్చర్ ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ట్రెండ్‌కు తగ్గట్లు రియలిస్టిక్‌గా ఉన్న ఈ సినిమా సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు. "ఈ సినిమాలో దాదాపు 90 శాతం మంది కొత్త వారే నటించారు. యూత్, పేరెంట్స్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా కథాంశం" అని గుణశేఖర్ అన్నారు.

సంతృప్తినిచ్చింది



ఇటీవలే 'హరోం హర' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు సుధీర్‌బాబు. తాజాగా అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం "మా నాన్న సూపర్‌హీరో". సునీల్ బలుసు నిర్మించారు. సాయిచంద్, షాయజీ షిండే కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

"ఇది బలమైన సంఘర్షణతో నిండిన కథ. ఇద్దరు తండ్రులు.. ఓ కొడుకు మధ్య జరిగే ఆసక్తి కరమైన సినిమా అని చెప్పొచ్చు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఎంతో లోతుగా ఉంటుంది. మానవ సంబంధాల మీద అరుదుగా కొన్ని సినిమాలు వస్తుంటాయి. ఈ సినిమా ఆ కోవకు చెందినదే. ఇందులో నటీనటుల నటన నుంచి కెమెరా యాంగిల్స్ వరకు ప్రతీది సహజంగా ఉండేలా దర్శకుడు కేర్ తీసుకున్నారు. సాయిచంద్, షాయాజీ షిండేలతో నటించడం మంచి వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్. సంగీత దర్శకుడు జైక్రిష్ అద్భుతమైన పాటలను ఇచ్చారు. ఇందులో ఉండే లవ్ ట్రాక్, స్టోరీని పక్కదారి పట్టనీయకుండా సందర్భానుసారం ఉంటుంది. ఇది పక్కా ఫ్యామిలీ చిత్రం. అవుట్‌పుట్ చూశాను. చాలా బాగా వచ్చింది. అందరికీ తప్పక నచ్చుతుంది. నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో అత్యంత సంతృప్తిని ఇచ్చిన చిత్రమిదే. ప్రస్తుతం 'జటాధర' ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. నా కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రమిది" అని చెప్పారు.



రామాయణంలోని పాత్రల ఆధారంగా...

డైరెక్టర్ రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లోని 'సింగం అగైన్'లో అజయ్ దేవ్‌గణ్ నటిస్తోన్న సంగతి తెలిసిందే. దాదాపు అయిదు నిమిషాల నిడివితో ఉన్న ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. రామాయణంలోని ప్రధాన పాత్రలను స్ఫూర్తిగా తీసుకుని దానికి అనుగుణంగా సినిమాను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఇందులో అజయ్ దేవ్‌గణ్‌ను రాముడిగా, కరీనా కపూర్‌ను సీతగా.. అర్జున్ కపూర్‌ను రావణుడిగా, రణ్‌వీర్ సింగ్‌ను హనుమంతుడిగా, టైగర్ ష్రాఫ్‌ను లక్ష్మణునిగా పోల్చి చూపించారు. ఈ ట్రైలర్‌లో దీపికా పదుకొణె, అక్షయ్‌కుమార్ కూడా తళుక్కుమన్నారు. దీపావళి కానుకగా నవంబర్ 1న సినిమా విడుదలవుతోంది.



తెలుగు డబ్బింగ్‌లకు తమిళ టైటిల్సా?



'బొమ్మరిల్లు', 'కిక్', 'ఎవడు' సినిమాలతో సినీ రచయితగా మంచి గుర్తింపు పొందారు అబ్బూరి రవి. ప్రస్తుతం 'డెకాయిట్' సినిమాకు పని చేస్తున్న ఆయన.. ఎక్స్ వేదికగా తెలుగులో రిలీజ్ అవుతున్న డబ్బింగ్ సినిమా టైటిల్స్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగువారికి సుపరిచితం కాని పేర్లతో సినిమాల టైటిల్స్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. "తెలుగు ప్రేక్షకులని అగౌరవపరుస్తున్నారు. ఒకప్పుడు 'డబ్బింగ్ సినిమాలకు తెలుగు పేర్లు పెట్టేవారు. ఇతర భాషలలో ఉండే బోర్డులని చక్కగా తెలుగులోకి మార్చేవారు. ఇప్పుడు అదంతా మానేసి విడుదల చేస్తున్నారు. ఆయా భాషల గొప్పతనాన్ని.. వారి కళాత్మకతని గౌరవిస్తాను. కానీ తెలుగు ప్రేక్షకులని ఇంత తేలికగా తీసుకోవటం నచ్చట్లేదు. తెలుగుని గౌరవించని వాళ్లని కూడా తెలుగువారు గౌరవించడం, ఆదరించడం.. ఆ సినిమాలను చూడటం కోసం మన డబ్బులు ఖర్చుపెట్టడం గొప్పతనమని నేను మాత్రం అనుకోవట్లేదు" అని పేర్కొన్నారు. ఈ ట్వీట్ ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. మంచి పాయింట్‌ను లేవనెత్తారు అంటూ నెటిజన్లు రవి పోస్ట్‌కు మద్దతు పలుకుతున్నారు. 'కంగువ', 'వేట్టయాన్', 'తంగలాన్', 'రాయన్' 'వలిమై', లాంటి పేర్లు పలకడానికే కష్టంగా ఉన్నాయి.. అయినా అటువంటి టైటిల్స్ బదులు చక్కగా తెలుగు టైటిల్స్ పెట్టొచ్చు కదా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

నవ్వించే సినిమా

ఇన్ ప్రోగ్రెస్




సుహాస్, సంగీర్తన హీరోహీరోయిన్లుగా నటించిన 'జనక అయితే గనక' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం మచిలీపట్నంలో జరిగింది. ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు దిల్ రాజు మాట్లాడుతూ 'మీ జిల్లా వాడు, మీలో ఒకడైన సుహాస్ నటించిన సినిమా ఇది. 'జనక అయితే గనక' పెద్ద హిట్ కాబోతోంది. అందరినీ నవ్వించే సినిమా ఇది' అని తెలిపారు. ఈ చిత్ర విజయం మీద ఎంతో నమ్మకం ఉందని హీరో సుహాస్ చెప్పారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు కూడా పాల్గొన్నారు.



మేజర్ వరదరాజన్ కథ

శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటిస్తున్న 'అమరన్' చిత్రం నుంచి తొలి పాట 'హే రంగులే'ను హీరో నితిన్ విడుదల చేశారు. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, రమ్య బెహర పాడారు. శివ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' కథ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సుధాకరరెడ్డి, నిఖితా రెడ్డి ఈ నెల 31న తెలుగులో విడుదల చేస్తున్నారు.

మాస్ జాతర



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి 'ఆడు ఆడు ఆడు నిలువెల్లా పూనకమై' అంటూ సాగే జాతర సాంగ్ విడుదల చేశారు. పూనకాలు తెప్పించే రీతిలో ఉన్న ఈ పాటలో హీరోహీరోయిన్లు పాల్గొన్నారు. 'క' చిత్రాన్ని వంశీ నందిపాటి తెలుగులో, హీరో దుల్కర్ సల్మాన్ మలయాళంలో విడుదల చేస్తున్నారు.



పీరియాడిక్ ప్రేమకథ

మంచు లక్ష్మి ప్రధాన పాత్ర పోషించిన పీరియాడిక్ ప్రేమకథ 'ఆదిపర్వం' ఈ నెల 31న విడుదల కానుంది. ఆదిత్య ఓం మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథ ఇదని దర్శకుడు సంజీవ్ మేగోటి చెప్పారు.మంచు లక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా ఆమె క్యారెక్టర్ లుక్‌ను విడుదల చేశారు. ఇంతవరకూ చేయని సరికొత్త పాత్రను ఇందులో ఆమె పోషించారు. 1974-90 మధ్య కాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు దర్శకుడు చెప్పారు. దుష్టశక్తికి, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధం ఇదని అన్నారు. రెట్రో ఫీల్‌తో లవ్‌స్టోరీగా 'ఆదిపర్వం' మొదలై యాక్షన్ థ్రిల్లర్‌గా అలరిస్తుందని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఘంటా శ్రీనివాసరావు చెప్పారు. తెలుగు సినిమాల్లో ఇదొక గొప్ప ప్రయత్నం అని సహ నిర్మాత గోరంట శ్రావణి చెప్పారు. రావుల వెంకటేశ్వరరావు సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంది.

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 161 అర్జీలు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ

కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా భూ సమస్యలపై వినతులు వస్తున్నాయి. ఈ అర్జీలను అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 70 శాతం వినతులు భూసమస్యలే. సోమవారం 161 అర్జీలు రాగ, రెవెన్యూ శాఖకు సంబంధించి 102 వినతులు, డీ ఆర్‌డీఏ 25, మున్సిపాల్టీలో 14, పంచాయతీరాజ్ 6, విద్యాశాఖ 4 , డీపీవో 10 సమస్యలు వచ్చాయి. జేసీ సేతు మాధవన్, డీఆర్వో అనిత ఈ వినతులు స్వీకరించారు.

పాఠశాల మైదానం అభివృద్ధికి నిధులు మంజూరు

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి రూ.5లక్షలు మంజూరైనట్లు శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి పంచాయతీ సాధారణ సమావేశంలో ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సాధారణ సమావేశానికి ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైఎస్‌ఎంపీపీ ఇందుకూరి సుధారాజుతో పాటు ఆమె హాజరయ్యారు. పట్టణానికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. కార్యనిర్వాహక అధికారిణి అనురాధ ఉన్నారు.

మట్టి నమూనాలపై అవగాహన

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కిల్తంపాలెం నవోదయ విద్యార్థులకు మండల వ్యవసా యాధికారి రవీంద్ర ఆధ్వర్యంలో మట్టిపరీక్షలపై అవగా హన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మట్టినము నాలను ఏవిధంగా సేకరించాలి, దీని ఉపయోగాలపై ఏవో రవీంద్ర వివరించారు. దీనిపై విద్యార్థులు గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

సీఐగా వెంకటేశ్వరరావు

విజయనగరం క్రైం: విశాఖ రేంజ్ పరిధిలో 10 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా విశాఖపట్టణం వీఆర్‌లో ఉన్న బీవీ వెంకటేశ్వరరావును విజయనగరం వీఆర్‌కి బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హెచ్‌డీటీగా గిరిధర్..

రామభద్రపురం: మండల రెవెన్యూ కార్యాలయంలో హెచ్‌డీటీగా కే.గిరిధర్ సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. మెరకముడిదాం హెచ్‌డీటీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌డీటీ సుబ్బారావును బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఏవోగా అప్పారావు..

బొబ్బిలి రూరల్: ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయ పరి పాలనా(ఏవో) అధికారిగా డీవీ అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆదిబట్ల వెంకటచేస్లు స్థానంలో తెర్లాం మండలం నుంచి బదిలీపై వచ్చారు. వెంకటచేస్లు విజయనగరం కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

విధుల్లోకి అధికారులు

వంగర: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ముగ్గురు అధికారులు బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన డీటీ, ఆర్ఐ, సర్వేయర్‌లు బదిలీ కావటంతో వారి స్థానంలో ఆర్ఐగా రామారావు, డీటీగా గంగాభవాణీ, సర్వేయర్‌గా నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. వారికి వీఆర్ ఏలు స్వాగతం పలికారు.

కాచి వడపోసిన నీటిని తాగాలి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఈ సీజన్‌లో జ్వరాలు ఎక్కువగా వస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

సీబీఎం గర్ల్ స్కూల్‌ను విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్: బొబ్బిలి పట్టణంలోని సుమారు 110 సంవత్సరాలు చరిత్ర కలిగి ఉన్న సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల స్థలాన్ని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. సీబీఎం ట్రస్టు కాకినాడకు చెందిన వారు బొబ్బిలిలో ఉన్న స్థలాన్ని వైసీపీ నాయకుడుకి తప్పుడు మార్గంలో 9 నెలల క్రితం చీపురుపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ చేశారని ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం డీఆర్వో అనితకు వినతిపత్రం సమర్పించారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు కోరారు.

రోడ్ల మరమ్మతుల పనులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు ఇబ్బందులు పడకుండా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సూచనల మేరకు నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రోడ్ల మరమ్మతుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని గోతులు ఏర్పడటంతో అన్ని ప్రధాన రహదారుల మరమ్మతుల పనులను మున్సిపల్, ఆర్అండ్‌బి శాఖలు యుద్ధప్రాతిపదికిన పనులు నిర్వహిస్తున్నారు. ఉత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎటువంటి అసౌర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారవేదికపై వీడియో కాన్ఫరెన్స్

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ సోమవారం మండల స్థాయి అధికారులతో నేరుగా వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై కలెక్టర్ అంబేడ్కర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా, గ్రామ వార్డు సందర్శనకు వెళ్లే అధికారులు ఆయా గ్రామం లేదా వార్డులోని అన్ని ప్రభుత్వ సంస్థలను సందర్శించి ఆయా సంస్థల పనితీరును, ఆ సంస్థల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఓ పి రవికుమార్, తహసీల్దార్ ఎం శ్రీను, మున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన వినతులు

- ఎమ్మెల్యే కోళ్ల ప్రజా దర్బార్‌కు తాకిడి
- వెయ్యికి పైగా అర్జీలు స్వీకరించిన లలితకుమారి


ఎస్.కోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్‌కు హాజరైన ప్రజలు


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేది కలో భాగంగా స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు పోటెత్తాయి. దరఖాస్తులు అందించేందుకు వచ్చిన వారితో కార్యాలయ ఆవరణ నిండిపోయింది. ఎమ్మెల్యేకు సమస్యలను చెప్పుకునేందుకు వచ్చేవారు క్యూ కట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ట్రాక్టర్స్, జేసీబీ హైడ్రాలిక్ వర్కర్స్ యూ నియన్ టోల్‌గేట్ ఫీజుల రద్దుతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని, ఇసుక రీచ్‌లను తెరవాలని కోరారు.

1083 వినతులు..

ఈ కార్యక్రమంలో మొత్తం 1083 వినతులు రాగా అత్యధికంగా ఇళ్ల స్థల పట్టాలు, భూసమస్యలకు సంబంధించి 558 వినతులు వచ్చాయి. ఆ తరువాత సామాజిక పింఛన్ల కోసం 464 మంది అభ్యర్థించారు. గృహ నిర్మాణ శాఖకు 59 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏపీఈపీడీసీఎల్‌కు 2 దరఖాస్తులు అందాయి. ఎంపీపీ సండిసోమేశ్వరరావు, వైఎస్ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మండల టీడీపీ అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ అరుణ కుమారి తదితరులున్నారు.

బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లాలోని పోలీసు స్టేషన్‌ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి, 48 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించినవి 21, కుటుంబ కలహాలకు సంబంధించి మూడు ఫిర్యాదులు, మోసాలకు పాల్పడినట్టు 11 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించి 13 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ ఫిర్యాదులను పరిష్కరించాలని, వాటి పూర్వాపరాలను పరిశీలించి అంశాలు వాస్తవమైనట్టయితే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి ఏడు దినాల్లో తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎస్ఐ రాజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

వలంటీర్లను ఉద్యోగాల్లో కొనసాగించాలి



ఆందోళన చేస్తున్న వలంటీర్లు

విజయనగరం దాసన్నపేట: వలంటీర్లను తక్షణమే ఉద్యోగాల్లో కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ, నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, 2019లో సచివాలయ వ్యవస్థ కంటే ముందుగానే వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువకులను వలంటీర్లుగా నియమించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేయడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సేవలు అందించారన్నారు. వీటిని దృష్టిలో వుంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వలంటీర్ల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు రవీంద్ర, మోహన్, ఆదిత్య, కుమారి, దేవితో పాటు రంగరాజు, అప్పలరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి


బొబ్బిలిలో సీపీఎం సభ్యుల నిరసన దృశ్యం

విజయనగరం దాసన్నపేట: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే ఐక్యరాజ్యసమితి కలుగజేసుకుని శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రతినిధులు రమణమ్మ, సురేష్, ఆనంద్, నాగభూషణం, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి/బొబ్బిలి రూరల్: బొబ్బిలి కోరాడ వీధి సెంటర్‌లో సోమవారం సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరరావు ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి పాలస్తీనా భూభాగాలపైన, లెబనాన్ పైన ఆసుపత్రులు, పాఠశాలు, మసీదులపై వైమానిక దాడులతో వేలాది మందిని చంపుతుందన్నారు. తక్షణమే ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సీపీఎం పార్టీ దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిందని అన్నారు. సీపీఎం పట్టణ నాయకులు బి యుగందర్, జి రామారావు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలకు కృషి


కూరగాయల మార్కెట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: మండల కేంద్రంలో ఉన్న కూరగాయల మార్కెట్‌లో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. సోమవారం మార్కెట్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో రామభద్రపురం సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కరణం విజయభాస్కర్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రైల్వే మంత్రికి ఎంపీ కలిశెట్టి వినతి

విజయనగరం(ఆంధ్రజ్యోతి): విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమక్షంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను ఢిల్లీలో కలిసి చీపురుపల్లి, రాజాం, పాలకొండ, సీతంపేట, కొత్తూరు, పర్లాకిమిడి, మెలియాపుట్టి, పలాసలను కలిపే రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు.

- **రాజాం:** విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు రావాలని పార్లమెంట్ స్పీకర్ ఓం బిర్లాకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆహ్వాన పత్రికను సోమవారం అందజేసినట్లు ఫోన్‌లో తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వంశీయుల ఆహ్వానం మేరకు భారత పార్లమెంట్ స్పీకర్ ఓం బిర్లాకు కలిసి ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు. అక్టోబరు 13, 14, 15 తేదీల్లో జరగనున్న పైడితల్లి అమ్మవారి సిరిమాను మహోత్సవానికి రావాలని కోరారు. ఈ సందర్భంగా తిరుమల నుంచి తీసుకువెళ్లిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ప్రసాదాన్ని ఓం బిర్లాకు అందించినట్లు తెలిపారు

12వ వేతన సవరణ కమిషన్‌ను తక్షణమే నియమించాలి

బొబ్బిలి రూరల్: 12వ వేతన సవరణ కమిషన్‌ని తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు జేసీ రాజు కోరారు. బొబ్బిలిలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛను దారులకు వేతనాల సవరణకు సంబంధించి 12వ పే రివిజన్‌ని తక్షణమే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం పీఆర్‌సీని ఏర్పాటు చేసి సంవత్సర కాలంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించినా, అందుకు అవసరమైన వసతులు, సిబ్బందిని సమకూర్చకపోవటంతో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకుండా కమిషన్ రాజీనామా చేసిందన్నారు. అలాగే 20 శాతం మధ్యంతర భృతిని దసరా కానుకగా ప్రకటించి 2024 జూలై నుంచి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు మాట్లాడుతూ బకాయిపడిన డీఏ లను చెల్లించాలని, వైద్య ఖర్చులకు, గృహ నర్మాణాలు, వివాహాలు కొరకు అత్యవసరంగా వినియోగించుకునేందుకు దాచుకున్న పీఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్స్ కు దరఖాస్తు చేసి 6 నెలలు గడుస్తున్నా నేటికి మంజూరు చేయక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఖాదర్‌బాబా జయంత్యుత్సవం

- విశ్వశాంతికై దర్గాలో ప్రత్యేక పూజలు

విజయనగరం టౌన్: సూఫీ సెహన్షా హుజూర్ హజరత్ సయ్యద్ ఖాదర్ ఔలియా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాబామెట్ట ఖాదర్‌బాబా దర్బార్ షరీఫ్‌లో ఆయన జయంత్యుత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. హజరత్ అతాఉల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీబాబా కుమారులు, విజయనగరం ఖాదర్‌బాబా దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా ఖాదర్ (ఖలీల్‌బాబు) నేతృత్వంలో వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు చీమలపాడు ఏఏఎంటీకే దర్గా దర్బార్ పీఠాధిపతి ముహమ్మద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే డప్పు వాయిద్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. విశ్వశాంతికై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భారీ అన్న ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.


ప్రార్థనలు చేస్తున్న భక్తులు

గ్రూపులు కడితే వేలం ప్రక్రియ వాయిదా

- మద్యం వ్యాపారులతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు బాబ్జీరావు


మద్యం వ్యాపారులతో మాట్లాడుతున్న డీసీ

బొబ్బిలి, అక్టోబరు 7: మద్యం షాపుల వేలం ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల నమోదు సంఖ్య మందకొడిగా సాగుతుండడంతో స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి సోమవారం రాత్రి డిప్యూటీ కమీషనరు ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు వచ్చి పరిశీలించారు. సర్కిల్ పరిధిలో గల మద్యం వ్యాపారులందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి డీసీ మాట్లాడారు. విజయనగరం, పార్వతీపురం ఉమ్మడిజిల్లాల పరిధిలో మొత్తం 205 మద్యం షాపులకు వేలానికి సుమారు ఆరువేలకు పైగా దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నామన్నారు. అయితే ఇంతవరకు దరఖాస్తుదారుల నుంచి స్పందన మందకొడిగా ఉందన్నారు. బొబ్బిలి సర్కిల్ పరిధిలో 23 షాపులకు సోమవారం రాత్రి వరకు 166 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలో గల మద్యంషాపులకు ఆశించిన రీతిలో దరఖాస్తులు రాని పక్షంలో వేలం ప్రక్రియను వాయిదావేసే అవకాశం ఉందన్న విషయాన్ని వ్యాపారులు గ్రహించాలన్నారు. షాపులను చేజిక్కించుకునేందుకు ఎక్కడా ఎటువంటి గ్రూపులు, సిండికేట్లు వంటివి కట్టరాదని హితవు పలికారు. ఈ సందర్భంగా మద్యం వ్యాపారులు రాంబాబు, రమణమూర్తి, చౌదరి రమేష్ తదితరులు మాట్లాడుతూ బొబ్బిలిలో ఇంతవరకు మద్యం షాపుల నిర్వాహకులతో ఎటువంటి గ్రూపులు లేవని, అందరూ వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకుంటున్నట్లు తెలిపారు. డిపాజిట్, లైసెన్సు ఫీజుల భారం కొద్దిగా అధికంగా ఉందన్నారు. రామభద్రపురం మద్యంవ్యాపారులు కిర్ల కిరణ్, చిన్నారావు, ఆనందరావు తదితరులు మాట్లాడుతూ రామభద్రపురంలో అదనపు షాపులను మంజూరు చేయడం సరికాదన్నారు. గీత కార్మికుల కోటాను జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. నేషనల్, స్టేట్ హైవేల పరిధికి సంబంధించి సడలింపులు ఇవ్వాలన్నారు. అనంతరం డీసీ బాబ్జీరావు విలేకరులతో మాట్లాడారు. 28 మంది హెచ్‌సీలకు పదోన్నతలు కల్పించారని, ఎస్ఐల రిక్రూట్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. ఉమ్మడిజిల్లాల పరిధిలో అసిస్టెంట్ కమిషనరు నాయకత్వంలో ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేశామని, మద్యం, ఇతర వ్యవహారాలకు సంబంధించి గట్టి నిఘా పెడతామన్నారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

బొబ్బిలి: బావిలోకి దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలం లో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ఆర్.రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని దేవాంగులవీధికి చెందిన నారంశెట్టి మృత్యుంజయ రావు (70) గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతన్నాడు. ఎలర్జీ, ఒంటి నొప్పు లతో తీవ్రంగా బాధపడేవాడు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోయింది. దీంతో బాధ భరించలేక సోమవారం ఉదయం 3 గంటల సమయంలో మేదర బంద సమీపంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు వివరాల న్నిటినీ మృతుని కుమారుడు రామచంద్రమూర్తి తమకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొ న్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీసి స్థానిక సీహెచ్ సీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించామని ఎస్ఐ రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పెయింటర్ అనుమానాస్పద మృతి

శృంగవరపుకోట: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ మండలం పెదగుడిపాలకు చెందిన మారడిబూడి గణేష్(35) ఇళ్లకు పెయింటింగ్, పుట్టిలు వేస్తాడు. గ్రామానికి చెందిన మరికొందరితో కలసి ఎస్.కోట గ్రామంలో పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం అనంతరం తోటివారితో కలసి నిర్మాణంలో ఉన్న భవనంపైనే నిద్రపోయాడు. సోమ వారం ఉదయానికి అనుమానస్పదంగా మృతి చెంది పడి ఉన్నాడు. భార్య సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ సీహెచ్ గంగరాజు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి..

బెలగాం: పార్వతీపురంలోని బెలగాం రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటు తుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన తూముల బాలకృష్ణ(37) బెలగాం గేట్‌కు సమీపంలో పట్టాలు దాటు తుండగా ఓ గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో యువకుడు..

కురుపాం: సీడీమానుగూడ గ్రామలో పాము కాటుతో యువకుడు మృతి చెం దాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆరిక మోహనరావు(26) అనే వ్యక్తి ఇంటిలో నింద్రిస్తుండగా శనివారం రాత్రి పాము కాటేసింది. తమ కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లమని చెప్పినా వినిపించుకోకుండా తనకు తెలిసిన పసరు మందు వేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా మోహనరావు స్పృహ కోల్పోగా వెంటనే కుటుంబ సభ్యులు 108 ద్వారా కురుపాం ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మోహనరావుకి భార్య శైలిజ, రెండు నెలల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నబొండపల్లిలో ఉద్రిక్తత

పార్వతీపురం రూరల్: చిన్నబొండపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒక సామాజిక వర్గానికి చెందిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ వివాహం ఆదివారం జరిగింది. ఆదివారం జరిగిన ఊరేగింపు సందర్భంగా రెండు సామాజిక వర్గాల మధ్య స్వల్ప వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓ యువకుడిపై మరొక సామాజిక వర్గానికి చెందిన నలుగురు మూకుమ్మడిగా దాడి చేశారు. గమనించిన కొంతమంది గ్రామస్థులు ప్రశ్నించగా.. వారిపై కూడా రాళ్లతో, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ఓ సామాజిక వర్గానికి చెందిన గొంగాడ వెంకటనాయుడు, గండి నారాయణరావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రెండు సామాజిక వర్గాల మధ్య ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఇరు సామాజిక వర్గాలు ఒకరినొకరు నెట్టుకున్నారు. తమ వర్గాన్ని కొట్టిన వారిని తమకు అప్పగించాలని, లేకపోతే వెంటనే అరెస్టు చేయాలని మరో సామాజిక వర్గానికి చెందినవారు రహదారిపై బైఠాయించారు. దీంతో సీఐ గోవిందరావు, టౌన్ సీఐ నారాయణరావు, ఎస్ఐ దినకరన్, ఎస్ఐ సంతోష్‌కుమారి ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి ఇరువర్గాలను శాంతింప చేస్తున్నప్పటికీ ఫలితం దక్కలేదు. రాత్రి సమాచారం అందే వరకు పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది.

సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి


తహసీల్దార్ నీలకంఠారావుకు వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

కొత్తవలస: అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోను సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని ఈ చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు సూర్యారావు తెలిపారు. సోమవారం కొత్తవలసలోని తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసు స్టేషన్‌లలో సమాచార హక్కు చట్టం అమలు విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టంకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం అధికారి పేరు ఫోన్ నెంబర్‌తో పాటు, అప్పిలేట్ అధికారి, ఫోన్‌నెంబర్‌కు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చి 12 సంవత్సరాలు అవుతోందని, సామాన్య ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిది ఈ చట్టమన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను 41 బి అమలు చేయాలని, 17 అంశాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బాగంగా కొత్తవలస పోలీసు స్టేషన్ సీఐ షణ్ముఖరావు, తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఎంపీడీవో రమణయ్యకు ఇందుకు సంబంధించిన వినతిపత్రం అంద చేశారు. కార్యక్రమంలో ఈ కమిటీ సభ్యులు ఎల్. సాంబమూర్తి, ధనుంజయ్ పాల్గొన్నారు.

క్వారీలు, క్రషర్ల నుంచి కాపాడండి

జామి: మండలకేంద్రం సమీపంలో ఉన్న మాధవరాయమెట్ట ప్రాంతవాసులు తమ గ్రామ సమీపంలో ఉన్న క్రషర్లు, క్వారీల బారీ నుంచి తమను కాపాడాలని కోరుతు సోమవారం తహసీల్దార్ కృష్ణలత, ఎంపీడీవో నీలంనాయుడుకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ఆనుకుని దశాబ్దల తరబడి అనుమతులు లేని క్వారీలు, క్రషర్లు నడుస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని, వీటివల్ల తమ ఆరోగ్యాలు, గృహాలు దెబ్బతింటున్నాయని ఆందోళన చెందారు. ఈ క్రషర్లు, క్వారీల వల్ల గ్రామంలో ఉన్న రోగులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల విద్యార్థులకు మాస్టార్లు చెప్పే క్లాసులు వినిపించని పరిస్థితి నెలకొంటుందన్నారు. వీటి బారి నుంచి రక్షించాలని కోరారు.

అధికారులకు సత్కారం


అధికారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్: నీతి అయోగ్, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద సంపూర్ణ అభియాన్ ముగింపు వేడుకను సీతంపేట ఐటీడీఏలో పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ ముగింపు వేడుకల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు పీవో సత్కరించారు. నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఈ వేడుకలను నిర్వహించినట్టు తెలిపారు. సంపూర్ణ అభియాన్‌లోని మొత్తం ఆరు సూచికల్లో వంద శాతం సంతృప్తిమైనట్టు తెలిపారు. భామిని బ్లాక్ స్థాయి అధికారులు, ఫ్రంట్‌లైన్ కార్మికుల మద్దతుతో 25 సెప్టెంబరు 2024న సూచించిన ఆరు సూచికలు విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, సోషల్ డెవలప్‌మెంట్ విభాగాల్లో సంతృప్తి పొందినట్టు పీవో తెలిపారు. భామిని మండల ఏఎంవో, సీడీపీవో, ఎంవో, వెలుగు ఏపీఎం, బత్తిలి, బాలేరు, భామిని వైద్యాధికారులు, ఆశ కార్యకర్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, ఎంఏవో కె.సింహాచలం, ఎంఈవో ఎ.శ్రీనివాసరావు, సీడీపీవో శాంతిభవానీ, ఎంవోలు పి.సోయల్, డాక్టర్ దీపికారాణి, డి.దామోదరరావు, ఏపీఎం భవానీ, బ్లాక్ కో-ఆర్డినేటర్ కె.మహేశ్వరరావు తదితరులున్నారు.

ప్రణాళికలు పూర్తి చేయండి


సిబ్బందికి సూచనలిస్తున్న శ్రీహరినాయుడు


గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా అభివృద్ధి పనులకు నిర్దేశించిన సమయాని కి ప్రణాళికలు పూర్తి చేయాలని జిల్లా ఉపాధి హామీ అదనపు సంచాలకుడు గుంట్రెడ్డి శ్రీహరినాయుడు సూచించారు. మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేట క్లస్టర్ పరిధిలోని 170 పంచాయతీల్లో నవంబరు 30లోగా ప్రణాళికలు తయారీ పూర్తికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 42 లక్షల పనిదినాలను దృష్టిలో పెట్టుకుని అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఏడు మండలాల పరిధిలో 70 వేల మునగ మొక్కలు పెంపకం చేపడుతున్నారని చెప్పారు. వేతనదారులకు ఉపయోగపడేందుకు మండలానికి 10 వేల మొక్కలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. నిబంధన మేరకు క్షేత్రస్థాయిలో ట్యాగింగ్ చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం ఎం.గౌరీనాథ్, ఉపాధి ఈసీ మరిశర్ల హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

ఏరియా ఆసుపత్రికి క్యూకట్టిన రోగులు


ఏరియా ఆసుపత్రిలో ఓపీ కౌంటర్ వద్ద బారులు తీరిన రోగులు

సీతంపేట రూరల్: సీతంపేట ఏరియా ఆసుపత్రికి జ్వర పీడితుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. సోమవారం ఏరియా ఆసుపత్రికి 340 వరకు ఓపీ వచ్చింది. వీరిలో 50 మందికి పైగా జ్వర పీడితులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల గిరిజనులను జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి.

ఏనుగుల సంచారం


గుచ్చిమి సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

సీతానగరం: మండలంలోని సీతారాం పురం, గుచ్చిమి గ్రామాల సమీప తోటలు, కొండల ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తు న్నాయి. సోమవారం ఉదయం పుటిగు మ్మి, పుట్టూరు పరిసరాల్లోని వరి, మొక్క జొన్న పంట పొలాల్లో తిరుగుతూ పంట లు నాశనం చేశాయని రైతులు వాపోతు న్నారు. ప్రత్యేక పర్యవేక్షణ అధికారి మణి కంఠేష్ నేతృత్వంలో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

భూ హక్కు పట్టాలు మంజూరు చేయండి

పాచిపెంట: దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని మోదుగ పంచాయతీ పరిధిలో గల మోదుగ, పర్తాపురం, గల్లపాడులకు చెందిన గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్ డి.రవికి వినతిపత్రం అందజేశారు. గతంలో కూడా భూహక్కు పత్రాల కోసం లిఖిత పూర్వకంగా విన్నవించుకోగా విశాఖపట్నం జిల్లా అనంతగిరి రేంజ్ పరిధిలో ఉందని అధికారులు చెప్పారని గిరిజన రైతులు వాపోయారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు అయిన తర్వాత సాలూరు అటవీశాఖ రేంజ్ పరిధికి వచ్చిందని, ఇప్పటికైనా భూహక్కు పత్రాలు ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద మంజూరు చేయాలని కోరారు. అటవీశాఖ, ఐటీడీఏ అధికా రులతో చర్చించి చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలియజేశారు.

ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటన

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి, కాశీపట్నం గ్రామాల్లో ఎన్‌ఎల్‌ఎం (నేషనల్ లెవెల్ మానిటరింగ్) బృందం సోమవారం పర్యటించింది. ఉపాధి హామీ పనుల పరిశీలన, ఏడు రిజిష్టర్ల నిర్వహణపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పింఛన్లు, ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు, మహిళా సంఘాలు, వీవోఏల సమాచారంపై రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ నుంచి టీం సభ్యులు ఎంకే శశి ఆపన్, కేజీ సలీంకుమార్, సాలూరు క్లస్టర్ ఉపాధి హామీ ఏపీడీ రమేష్‌రామన్న, ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ, వెలుగు ఏపీఎం బలగ సన్నిబాబు, మండల స్థాయి అధికా రులు పాల్గొన్నారు.

వీధి దీపాలు బాగు చేయించారు

సాలూరు రూరల్: మున్సిపాల్టీలోని 28, 29 వార్డుల పరిధిలో కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ సోమవారం పర్యటించారు. అయా వీధుల్లో పారిశుధ్య నిర్వహణ, మురుగునీటి పారుదల తదితర అంశాలను పరిశీలించారు. వీధుల్లో వీధి దీపాలను వెలగడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో వెను వెంటనే సిబ్బందిని రప్పించి స్వయం పర్యవేక్షణలో వాటిని బాగు చేయించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో గ్రీవెన్స్‌ను నిర్వహించి పలువురి నుంచి వినతులు స్వీకరించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సాలూరు మున్సిపాల్టీకి తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతు లు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఒక్కరోజు నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్

రాయగడ: స్థానిక జడ్పీ సమావేశ మంది రంలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వ హించారు. కలెక్టర్ పారుల్ పట్వార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జడ్పీ కార్యనిర్వాహణాధికారి నిహారరంజన్ కహర్ తదితరులు పాల్గొని, అర్జీదారుల సమస్యలను విన్నారు. గ్రీవెన్స్‌కు 80 ఫిర్యాదులు అందగా వాటిలో గ్రామానికి సంబంధించినవి 12 ఫిర్యాదులు ఉండగా, 63 మంది తమ వ్యక్తిగత సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ 21మంది సమస్యలను వెంటనే పరిష్కరించారు. ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.65వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి సంబంధించి తాగునీరు, విద్యుత్, రహదా రుల వంటి మౌలిక సదుపాయాలపై గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు. గ్రామస్థుల సమస్యలను వెంటనే పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా

నకిలీ విత్తనాలతో నష్టపోయాం

- విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి
- గిరిజన రైతుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి/ బెలగాం: నకిలీ విత్తనాలు విక్రయించిన వారి పై చర్యలు తీసుకుని, నష్టం పరిహారం చెల్లించాలని మక్కువ మండలం నంద పంచాయతీకి చెందిన 13 మంది గిరిజన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మక్కువ గ్రామానికి చెందిన ఇద్దరు కంపెనీ ఏజెంట్లు వద్ద మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి సుమారు 20 ఎకరాల్లో నాట్లు వేశామని చెప్పారు. ఈ నకిలీ విత్తనాల కారణంగా ఎకరాకు రూ.75వేలు చొప్పున నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకుని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. గిరిజన రైతులు పాల్గొన్నారు.

దర్యాప్తునకు కలెక్టర్ ఆదేశం

నకిలీ విత్తనాలు వల్ల గిరిజనులు మోసపోవడంపై కలెక్టర్ శ్యాంప్రసాద్ తీవ్రంగా స్పందించారు. వెంటనే గ్రామానికి వెళ్లి నకిలీ విత్తనాలు వల్ల ఎంతమంది రైతులు నష్టపోయారు, పంట ఎంతవరకు నష్టపోయింది, విస్తీర్ణంతో పాటు రైతుల వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని వెంటనే నివేదికను అందించాలని జిల్లా వ్యవసాయా ధికారి రాబర్ట్‌పాల్‌కు ఆదేశించారు.

ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- 105 అర్జీలు స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరిం చాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం లో ఆయన అధ్యక్షతన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.కేశవనాయుడులతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 105 మంది అర్జీదా రులు తమ వినతులను కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

శంకరన్ అందరికీ ఆదర్శం

పీపుల్స్ ఐఏఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్న ఎస్.ఆర్.శంకరన్ చూపిన మార్గం అందరికీ ఆదర్శమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్.ఆర్.శంకరన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.కేశవనాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయండి

తాను పూర్తిగా ఏమీ పనిచేయలేని పరిస్థితిలో ఉన్నా నని, తనకు రూ.10వేలు పింఛన్ మంజూరు చేయాలని సీతానగరం మండలానికి చెందిన రామ్మోహన్‌రావు అనే దివ్యాంగుడు కోరాడు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు తన పరిస్థితిని వివరించాడు.

వీధిన పడ్డాం.. న్యాయం చేయండి

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో తాము ఉపాధి కోల్పోయామని, తమకు న్యాయం చేసి విధుల్లోకి తీసుకోవాలని గిరిజన ఇంజినీరింగ్ శాఖలో పనిచేస్తూ విధుల నుంచి తొలగించబడిన టెక్నికల్ అసిస్టెంట్లు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు మొరపెట్టుకున్నారు. దీనిపై ప్రభుత్వానికి లేఖరాసి తగు చర్యలు తీసుకుంటానని పీవో హామీనిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 42 వినతులు


గిరిజనుల సమస్యలు వింటున్న పీవో

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 42 వినతులు వచ్చాయి. రహదారి, మంచినీటి సౌకర్యం వంటి సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు ఐటీడీఏ పీవోను కోరారు. పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, పీహెచ్‌వో వెంకటగణేష్, ఏటీడబ్ల్యూవో మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

కురుపాం: ఆసక్తిగల అభ్యర్థులు నిర్ణీత గడువు లోగా మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవాలి ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్ కోరారు. కురుపాం, గుమ్మ లక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలానికి సంబంధించిన ఆరు షాపుల కోసం కురుపాం కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపడుతున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సోమవారం సాయంత్రం వరకు ఆరు షాపు లకు నలభై దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. అక్టోబరు 9వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉందన్నారు. నాన్ రిఫండబుల్ డీడీ, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలతో కురుపాం ఎక్సైజ్ కార్యాయం వచ్చి దరఖాస్తులు చేసుకోవచ్చాన్నారు.

కురుపాంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

కురుపాం: కురుపాం కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ చైర్‌ప ర్సన్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్పిన్ ఆధ్వర్యంలో సోమవా రం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ రిసోర్స్ పర్సన్లు, న్యాయమూర్తులు ఏపీఎల్ పద్మజ, పీవీ వరలక్ష్మి మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పారా లీగల్ వలంటీర్లు అందవరపు కోటేశ్వరరావు, ఎం.మహేశ్వరి, బి.విజయలక్ష్మి, ఎస్.రాజేష్, కోర్టు ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

రోజుకు రూ.లక్ష పన్ను వసూలు లక్ష్యం

సాలూరు రూరల్: సాలూరు మున్సిపాల్టీ పరిధిలో రోజుకు లక్ష రూపాయలు పన్ను వసూలు లక్ష్యం నిర్ణయించుకున్నామని మున్సిపల్ రెవెన్యూ అధికారి పి.ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన వివిధ షాపులకు వెళ్లి కలెక్షన్ డ్రైవ్ నిర్వహించారు. వారి నుంచి పన్నులు వసూలు చేశారు. పన్నులను సకాలంలో చెల్లిస్తే వడ్డీ ఉండదన్నారు. నిర్ణీత గడువు కంటే ముందుగా చెల్లిస్తే రాయితీ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గడువు తర్వాత చెల్లిస్తే వడ్డీ చెల్లించాలన్నారు.

మామిడిపల్లిలో సికిల్‌సెల్ ఎనీమియా కేసులు

సాలూరు రూరల్: మామిడిపల్లిలోని ఓ వీధిలో ఇద్దరు చిన్నారులు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధికి గురయ్యారు. దీంతో మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివకుమార్ వైద్య సిబ్బందితో గ్రామంలో పర్యటించి, వారి పరిస్థితిని పరిశీలించారు. వారికి అందుతున్న చికిత్స, అందించాల్సిన వైద్యసేవలు తదితర అంశాలను వైద్యసిబ్బందికి వివరించారు. తల్లిదండ్రులతో మాట్లాడారు. అలాగే తాగునీటి సరఫరా జరిగే ట్యాంకును పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మహాచండీగా దుర్గమ్మ

- కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- మండపాల్లో ప్రత్యేక పూజలు


సాలూరు రూరల్: సింధూరంతో కామాక్షి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మతల్లి సోమవారం మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లోనూ, మండపాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


సాలూరు రూరల్: మహాచండీగా సంతోషిమాత


పాలకొండ: మహాచండీగా కోటదుర్గమ్మతల్లి ఉత్సవ విగ్రహం

కోటదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్

పాలకొండ: పాలకొండలోని కోటదుర్గమ్మ తల్లిని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయ ణ, ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతిం చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. ఆలయ విశిష్టతను, అమ్మవారి చరిత్రను కలెక్టర్‌కు వివరించారు. వారితో పాటు సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఆలయ అధికారులు ఉన్నారు.


మక్కువ: లక్ష్మీదేవి అలంకరణలో పోలమాంబ


పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయంలో కుటుంబ సభ్యులతో పూజల్లో పాల్గొన్న కలెక్టర్

అభివృద్ధికి సహకరించాలి

- ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ ప్రారంభం


శిక్షణలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: పంచాయతీల అభివృద్ధికి ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు సహకరించాలని ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఆయన తోపాటు ఎంపీపీ ఉరిటి రామారావు పాల్గొన్నారు. సంతోషపురం, ఉల్లిభద్ర, దళాయివలస, సుంకి, ఉద్దవోలు గ్రామాలకు చెందిన వారికి పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఎంపీడీవో జి.పైడితల్లి మాట్లాడుతూ రెండో విడతలో 9, 10 తేదీల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- **వీరఘట్టం:** గ్రామాభివృద్ధి ప్రణాళికపై ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, రెండు రోజుల శిక్షణా తరగతులు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి.వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లోని జీపీడీపీ బీపీడీపీ, డీపీడీపీ 2024-25 ప్రణాళిక తయారీ వివరాలు వివరించారు. గ్రామాల్లో వీధి దీపాలు నిర్వహణ గుర్తించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో డి.వెంకటరావు, ఏపీవో జి.సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీలు, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.


సీతంపేట రూరల్: శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

- **మక్కువ:** పంచాయతీల పరిపాలన విధానంపై ప్రజాప్రతిని ధులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 21 పంచాయతీ ల పరిధిలోని ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ నిధుల వ్యయ ఖర్చులపై సమిష్ఠ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్‌డి పి.దేవకుమార్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.
- **సీతంపేట రూరల్:** స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో మండల పరిధిలోని 53 పంచాయతీలకు చెందిన ఉప సర్పంచ్, ఇద్దరు వార్డుమెంబర్లకు తాగునీరు, కామన్ అడ్మినిస్ట్రేటివ్, గ్రామసభపై సోమ వారం శిక్షణ అందించారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, డీపీవో రాంప్రసాద్ ఈ శిక్షణలో పాల్గొన్నారు. వార్డు సభ్యులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీవో కొండపల్లి సత్యం, ఎంవోటీలు గా సీతంపేట పంచాయతీ కార్యదర్శి సుదర్శనరావు, కుశిమి, కుడ్డపల్లి పంచాయతీ కార్యదర్శి రాజశేఖరం, పాపారావు పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

బెలగాం: గ్రామ, వార్డు వలంటీర్లకు ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వారిని విధుల్లో కొనసాగించి, రూ.10వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు యనమల మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వచ్చి, ఆందోళన చేశారు. అనంతరం పీడీ రామచంద్రరావుకు సమస్యలు తెలియజేశా రు. సీఐటీయూ నాయకులు ఇందిరా, బీవీ రమణ, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

సీతానగరం తహసీల్దార్‌గా ప్రసన్నకుమార్

సీతానగరం: మండల తహసీల్దార్‌గా ప్రసన్నకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయ నగరం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈయనకు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రావుపల్లిలో వైద్య శిబిరం

గరుగుబిల్లి: రావుపల్లి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన రావుపల్లి బోను సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని, రోగులకు ఉచిత తనిఖీలు నిర్వహించి, అవసరమైనవారికి మందులు అందజేశారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు, సర్పంచ్ బొంతాడ మహేష్, మాజీ సర్పంచ్ గుల్ల కాశీనాయుడు, బోను వాగ్దేవి పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా చక్రపాణి

భామిని: భామిని ఏపీఎంగా ఎం.చక్రపాణి సోమవా రం బాధ్యతలు స్వీకరించారు. భామినిలో పనిచేస్తున్న ఏపీఎం డి.భవానీ రాజాం బదిలీపై వెళ్లారు. ఈసందర్భం గా ఏపీఎం సిబ్బందితో పరిచయం చేసుకుంటూ సమావే శం నిర్వహించారు.

నేడు కొమరాడలో ఎమ్మెల్యే పర్యటన

కొమరాడ: మండలంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయశేఖరపాత్రుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కోటి పాం నుంచి గుంప సోమేశ్వర ఆలయం వరకు నిర్మించ నున్న బీటీ రహదారి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం కూనేరు గ్రామంలో ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని కూటమి నా యకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

సాలూరు రూరల్: రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా ఉత్తమ సేవలు అందించే విధంగా సిబ్బంది శ్రద్ధ చూపాలని నాబార్డ్ డిప్యూటీ డీఎం ఎస్.దినేష్‌కుమార్ అన్నారు. శివరాంపురం పీఏసీఎస్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. పీఏసీఎస్‌లో నిర్వహించే లావాదేవీలను, రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ అఫిషియల్ పీఐసీ బి.శ్రీకాంత్, సీఈవో కరిబుగత హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యతోనే ఉపాధి అవకాశాలు

గరుగుబిల్లి: వృత్తి విద్యతోనే ఉపాధి అవకాశాలు సాధ్యపడతాయని జిల్లా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీలోని విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యలో శిక్షణ పొందితే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునన్నారు. పలువురు విద్యార్థినులకు బ్యూటీషన్ కోర్సుపై శిక్ష ణ అందించారు. ఏపీవో వైకేబీ హరిప్రసాద్, ఉపాధ్యాయులు కె.శైలజ పాల్గొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావం

పార్వతీపురం టౌన్: పాలస్తీనాకు సంఘీభావంగా జిల్లా కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం ఉదయం వామపక్ష నాయకులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాజాపై దాడులను ఆపాలని కోరారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు